## క్లుప్తంగా

### ధోబీ ఖానా నిర్మించాలని వినతి



కోఆప్షన్ సభ్యుడు భాస్కరరావుకు వినతి పత్రం అందిస్తున్న పద్మనాభనగర్ వాసులు

**గోపాలపట్నం:** జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీకి చెందిన పైడిమాంబ రజక సేవా సంఘం సభ్యులు తమ సమస్యలపై బుధవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర రావుకు వినతి పత్రం అందించారు. జనతా కాలనీలో ధోబీ ఖానా నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తోకాడ రాము, వై. అప్పలరాజు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న జియ్యాని విజయ్, స్నేహితులు

**గోపాలపట్నం:** ఓ ఆలయంలో ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గాయాలపాలైన అర్చకుడి కుటుంబానికి శాంతినగర్ యువ నాయకుడు జియ్యాని విజయ్ భరోసాగా నిలిచారు. నివేదన సమర్పించేందుకు వంట చేస్తుండగా గ్యాస్ లీకవడంతో అర్చకుడు ఆకెళ్ల రామ మూర్తికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జియ్యాని విజయ్ ఆ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. నిత్యావసర సరకులతో పాటు రూ.12000 నగదు ఆయన అందించారు. ఆయనతో పాటు స్నేహితులు రవి కుమార్, జి. నూకరాజు, జి. చరణ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం



బొజ్జ ప్రసాద్

**మల్కాపురం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యంపై కేసునమోదైంది. వివరాలు.. కప్పరాడ సమీపంలో రాంజీ ఎస్టేట్‌కు చెందిన బొజ్జ ప్రసాద్ (40) ఈ నెల 20 మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అతని సోదరుడు బొజ్జ వెంకట రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాద్‌కు ఊర్వశి కూడలి వద్ద ఆటోమొబైల్ షాపు ఉంది. రోజూ మాదిరిగానే ఉదయాన్నే షాపునకు వెళ్లాడు. మధ్యాహ్నం ప్రసాద్ తండ్రి భోజనం ఇవ్వడానికి షాపు దగ్గరకు వెళితే షాపు మూసి ఉంది. అప్పటి నుంచి ప్రసాద్ కనిపించడం లేదు. దీంతో ప్రసాద్ సోదరుడు రమేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం




యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



# ఇది మా అడ్డా!



మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఎదురు మార్గంలో పశువుల సంచారం



మహాలక్ష్మి థియేటర్ వద్ద సంచరిస్తున్న పశువులు



ఐవోసీ మార్గంలో వాహనాలకు అడ్డంగా నిలబడిన గేదెలు

- రోడ్లపై,వీధుల్లో పశువుల సంచారం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనఆదారులు

**మల్కాపురం:** నలుగురు నడిచే దారిలో, వాహనాలు తిరగాల్సిన మార్గాల్లో పశువులు సంచరిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీసు రోడ్లతో పాటు పలు వీధుల్లో నిత్యం ఇదే సమస్య కనిపిస్తోంది.దీంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు**

రెండు నెలల నుంచి శ్రీహరిపురం,మల్కాపురం, ఐవోసీ సర్వీసు రోడ్లలో ఉదయం,సాయంత్రం అన్న తేడా లేకుండా పశువులు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. స్థానికులు అభ్యంతరం చెబుతున్నా వాటి యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. క్రాంతినగర్,మల్కాపురం తదితర ప్రాంతాల్లో పశువుల పెంపకం దార్లు తమ ఇళ్ల వద్ద ఆ పశువులకు పాలు పితికిన తర్వాత మేత (ఆహారం) కోసం విడిచిపెడుతున్నారు. వాస్తవానికి పశువుల పెంపకం దార్లు శివారు ప్రాంతాల్లో పశువులశాల ఏర్పాటు చేసుకుని అక్కడ వాటిని పరిశుభ్ర పరచడం, మేత,పాలు పితకడం చేసుకోవాలని.కానీ వారి ఇంటి వద్ద పాలు పితికి అనంతరం వాటిని నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారు. ఇవి రోడ్లపైకి వచ్చి మల,మూత్ర విసర్జన చేస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. రోడ్లపై అడ్డంగా పడుకుంటాయి. ఆ సమయంలో వీటిని గుర్తించని వాహనదారులు ఢీ కొట్టి ప్రమాదాల పాలవుతున్నారు. మల్కాపురం,శ్రీహరిపురం ప్రాంతాల్లో డంప్ చేసిన వ్యర్థాలను భుజిస్తూ ఆ ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తున్నాయి.

### భయం.. భయం



నేను షిప్‌యార్డ్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు డ్యూటీకి మల్కాపురం నుంచి సింధియా ద్విచక్ర వాహనంపై వెళ్లినప్పుడు ఐవోసీ మార్గం వద్ద, నౌసేనాభాగ్ వద్ద ఆవులు, గేదెలు రోడ్డుపై సంచరిస్తుంటాయి. ఇవి ఒక్కో సారి పరుగు తీస్తూ వాహనాలపై పడుతుంటాయి. వీటి వల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంగా ఉంది.

–కాకర ప్రకాష్, వాహనదారు

### పశువుల బెడద



మల్కాపురం మార్గంలో వాకింగ్ చేస్తుంటాను. అయితే ఆ సమయంలో పశువులు సంచరించడంతో అ సౌకర్యంగా ఉంది. అవి ఎక్కడ వచ్చి పొడుస్తాయో అన్న భయం వెంటాడుతోంది.అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–రేవళ్ల సత్యనారాయణ, పాదచారు

### చర్యలు తీసుకుంటాం

పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీసు రోడ్లలో పశువుల సంచారం సమస్య ఇంత వరకు మా దృష్టిలో లేదు. దీనిపై ఆయా వార్డుల శానిటరీ అధికారులకు సమాచారం ఇచ్చి, సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–కృష్ణ, జోన్–5 జెడ్సీ

## నగర సుందరీకరణ పనుల పరిశీలన

**గోపాలపట్నం :** వచ్చే నెలలో జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో జాతీయ రహదారిలో జరుగుతున్న సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు బుధవారం పరిశీలించారు. ఎయిర్ పోర్టు జంక్షన్ నుంచి గ్రీన్ బెల్ట్ వరకు పరిస్థితి ఇంకా మెరుగు పడాలని, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లకు రంగులు వేసే పనులు త్వరతగతిన చేయాలని ఆదేశించారు. గ్రీన్ బెల్టు ఫెన్సింగ్ బాగు చేయాలని, వృథాగా ఉన్న కేబుల్ తీగలు తొలగించాలన్నారు. చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్న సైన్ బోర్డులు తొలగించాలని సూచించారు. గ్రీన్ బెల్టులో వ్యర్థాలు ఉండడాన్ని గమనించి వాటిని తొలగించాలని సూచించారు. విమాననగర్ జంక్షన్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ స్టాపులను ఆధునికీకరించాలని ఆదేశించారు. అలాగే వంటిల్లు సమీపంలో ఉన్న పాత బస్‌స్టాపులను పూర్తిగా తొలగించి ఆ స్థానంలో టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులు సత్వరం పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏడీసీ సన్యాసిరావు, సీసీపీ సురేష్, డీడీహెచ్ దామోదర్, ఎస్ఈలు రామ్మోహన్, వేణుగోపాలరావు, డీసీపీ రత్నకుమార్, జోన్–5 జెడ్సీ కృష్ణ, జోన్–8 జెడ్సీ మల్లయ్య నాయుడు, ఏసీపీ రమణ మూర్తి, ఈఈ సంతోషి కుమారి, జోన్–5 ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఏడీ జంక్షన్ వద్ద టాయిలెట్లు ఏర్పాటును పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

## 27న శ్రీకృష్ణ మందిరం వార్షికోత్సవం

**కంచరపాలెం:** గొల్లకంచరపాలెంలోని శ్రీకృష్ణ మందిర ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారు జామున 5గంటలకు ఉత్తర ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. ఉదయం 7గంటల నుంచి నుంచి పది గంటల వరకు స్వామి వారికి విశేష పూజలను దాతలు, వారి కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహినున్నామన్నారు.

## కార్మికుల భవిష్యత్తు అంధకారం



741వ రోజు దీక్షలో పాల్గొన్న బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు

**కూర్మన్నపాలెం:** ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తూ, కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 741వ రోజు, బుధవారం సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## గాంధేయ విలువలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

**ఏయూ క్యాంపస్:** సుస్థిర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి సాధనకు గాంధేయ విలువలు, విధానాలు అవసరమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరటి అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. సాంఘిక సంక్షేమంపై గాంధేయ ఆలోచనలు ఆమోదించిన స్వదేశీ మార్కెట్‌లు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని రోషిణి చెప్పారు. సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ గాంధీజీ పుస్తకాలను ఆమెకు బహూకరించారు. కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



రోషిణికి గాంధీజీ పుస్తకాలను బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

## అలరించిన స్వరార్చన

**సీతంపేట:** స్వరార్చన, యునైటెడ్ సింగర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో ఇటీవల పరమపదించిన సినీ దిగ్గజాలు కృష్ణ, కృష్ణంరాజు, జమున, కె.విశ్వనాథ్, వాణీ జయరామ్‌లకు స్వరార్చనతో నివాళులు అర్పించారు. గాయనీ గాయకులు భూపతిరావు, ఎస్.రాజేశ్వరి, బాబ్జి, భాగ్యలక్ష్మి, కృషరాజు, కల్యాణి, వెంకట్, సాత్విక సినీ దిగ్గజాల హిట్ సాంగ్స్ పాడి అలరించారు. వీరికి కీ బోర్డుపై సోమేష్, తబలాపై చలం, ఫాడ్స్‌పై బాబ్జి చక్కని సంగీతం అందజేశారు. ముందుగా సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, ఘంటశాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, స్వర మాధుర్యం అధ్యక్షులు ఎం.వి.ఆర్.నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు పుండరీ కుమార్, మెలోడి సత్యనారాయణ, ఫణి భూషణ్ పాల్గొన్నారు.



పాటలు ఆలపిస్తున్న గాయకులు

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**సింహాచలం:** వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పెందుర్తి ఎంఈవో పైడపు నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. పెందుర్తి మండలం గొల్లవిల్లిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల వర్క్స్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్, టీచింగ్ డైరీ రికార్డులు తనిఖీలు చేశారు. 5వ తరగతి విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణిత సబ్జెక్టుల్లో సామర్థ్యాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలని ఆదేశించారు.

## హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ

**సింహాచలం:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించవచ్చునని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ద్విచక్ర వాహనదారులకు సూచించారు. పెందుర్తిలో బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. 2022లో హెల్మెట్ ధరించక పోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 147 మంది మృతి చెందారని వివరించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా తమ వారికి హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలని సూచించారు.

## మాతృభాషతోనే విజ్ఞానం వృద్ధి

- ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత
- ముగిసిన అంతర్జాయ సదస్సు

**ఏయూ క్యాంపస్:** మాతృభాషతోనే విజ్ఞానాభివృద్ధి సాధ్యమని, అందులో ఉన్న మాధుర్యాన్ని విద్యార్థులు గ్రహించాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభాహాల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రెక్టార్ సమత మాట్లాడుతూ మన తెలుగు భాష చాలా గొప్పదని, ఆనాటి మహాకవుల కావ్యాలలో విలక్షణమైన పదజాలాలు ప్రయోగించారని గుర్తు చేశారు. విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఈ సమయంలో విద్యార్థులు సులభంగా ఏ భాషనైనా నేర్చుకునే శక్తి ఉంటుందని చెప్పారు. మాతృభాషను ప్రేమిస్తూనే ఇతర భాషలను గౌరవిస్తూ అభ్యసించాలని సూచించారు. గౌరవ అతిథిగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు మాట్లాడుతూ సదస్సులు జరిగినప్పుడే తెలుగు భాష గురించి మాట్లాడడం సరికాదని, నిరంతరం భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఆంగ్ల, హిందీ భాషలో ఉన్న పాఠ్య పుస్తకాలను మన మాతృభాషయైన తెలుగులోకి తర్జుమా చేసే నైపుణ్యం గల ఆచార్యులను నియమించే పనిలో ఉన్నామని చెప్పారు. విశిష్ట అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామెతలు, పొడుపు కథలు, నుడికారాలు విరివిగా నేర్చుకుంటే భాషపై పట్టుసాధించగలరని చెప్పారు. వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ అమ్మ వంటి కమ్మని భాషను మరవకూడదని కోరారు. సదస్సు నివేదిక అందించిన డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి 222 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు విచ్చేశారని, 72 పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.యోహానుబాబు, ఆచార్య అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ఆతుకూరి వెంకటేశ్వర్లు, తెలుగు విభాగ ఆచార్యులు వెలమల సిమ్మన్న, డాక్టర్ అయ్యంగారి సీతారత్నం, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, తదితరులు పాల్గొన్నారు. అతిథులకు సన్మానం చేశారు. పత్ర సమర్పకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



రెక్టార్ ఆచార్య సమతను సత్కరిస్తున్న నిర్వాహకులు

## పర్యటించి.. సమస్యలు తెలుసుకుని

52వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన

**గోపాలపట్నం:** జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, కరాసాలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం పర్యటించారు. రహదారుల పరిస్థితి, పారిశుధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరా.. వీధి దీపాలు వంటి సమస్యలను ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అపారిశుధ్యంగా ఉన్న ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో సిబ్బంది చేత శుభ్రం చేయించారు. పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌లో సూచించారు. ఆయన వెంట నాయకులు వెదుళ్ల శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు ఉన్నారు.



శాంతినగర్‌లో రోడ్డు సమస్యను డిప్యూటీ మేయర్‌కు వివరిస్తున్న స్థానికులు

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

**మల్కాపురం:** ఐవోసీ సర్వీసురోడ్డు నరకాన్ని తలపించే విధంగా ఉంది. ఇక్కడ భూగర్భ పైపులైన్ కోసం తవ్విన గోతులు సరిగ్గా పూడ్చకపోవడంతో ఈ మార్గాన రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు వచ్చే ఆయిల్ లారీల పార్కింగ్ స్థలంలో భూగర్భ పైపులైన్ వేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా పైపులైన్ పనులు పూర్తయినా ఆ గోతులు సరిగ్గా పూడ్చలేదు. పైపైన మట్టి వేసి వదిలేయడంతో వాహనాల బరువుకు మట్టి మరింత దిగువకు వెళ్లి అడుగు మేర గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇటువైపు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



అధ్వానంగా ఉన్న ఐవోసీ సర్వీసురోడ్డు

## 25న ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

**సింధియా:** భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో పోర్టు ఇంజినీరింగ్, డిప్లమో, ఇంటర్ డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నామని సెమ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సేతు మాధవన్ తెలిపారు. పోర్టు కళావాణి ఆడిటోరియంలో ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇంజినీరింగ్ యువతకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఇంటర్, డిగ్రీ మరియు డిప్లమో పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలపై ఇచ్చే సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సుకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారులు, తల్లిదండ్రులు,విద్యార్థులు రావచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు 9948183865, 7794840934 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు

**గోపాలపట్నం :** సీతారామరాజునగర్‌లో కాలనీ వాసులతో జేపీ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు ఒప్పందం చేసుకుని క్రికెట్ శిక్షణ ఇచ్చేవారు. కొన్నేళ్లుగా క్రికెట్ అకాడమీ కొనసాగుతోంది. అయితే ఇప్పుడు ఈ ప్రాంతంలో క్రికెట్ అకాడమీ నడిపేందుకు వీల్లేదని జీవీఎం అధికారుల సాయంతో క్రికెట్ నెట్, ఇతర సామగ్రి తొలగించడం సరికాదని జేపీ క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు జాన్ ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశాడు. అగ్రిమెంట్ ప్రకారం మూడు నెలల ముందుగా తనకు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా అసోసియేషన్ సభ్యులు ఇవ్వలేదని వాపోయాడు. తనపై దాడి జరుగుతుందనే ఉద్దేశంలో కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నానని అయితే ఇది అసోసియేషన్ సభ్యులపై మాత్రమే ఉందని తెలిపారు. దీంతో అసోసియేషన్ సభ్యులు ఏమీ చేయలేక జీవీఎంసీ ద్వారా తన అకాడమీని తొలగించారని, క్రికెట్ సామగ్రి మొత్తం ధ్వంసం చేశారని వాపోయాడు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికారులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.



జేపీ అకాడమీలో తొలగించిన క్రికెట్ నెట్

## గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి



నవీందర్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ క్యాంపస్:** యువతరం గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలని లండన్‌కు చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు నవీందర్ ఆకాంక్షించారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవసరమైన నైపుణ్యాలపై ఆయన ప్రత్యేక అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న దేశాలలో తాను అందిస్తున్న కన్సల్టింగ్ సేవలు, విధి విధానాలు, పనితీరు, ప్రగతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాధారణ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలతో పాటు, ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించుకుని పని చేయడంపై వివరించారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ఏయూ జియోఫిజిక్స్ ఆచార్యుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేసిన నవీందర్ కప్లిష్ ఏయూ విద్యార్థులకు పలు అంశాల్లో దిశానిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని నవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే దిశగా సహకారం అందించాలని వీసీ కోరారు. వర్సిటీతో కలసి పని చేయాలని సూచించారు. వర్సిటీ తరఫున నవీందర్‌ను సత్కరించారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

**సీతమ్మధార :** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ హెచ్చరించారు. బుధవారం సీతమ్మధార రైతు బజారును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బజారులో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్‌ను పరిశీలించారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు బజారు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రైతుల స్టాల్స్ వద్దకు వెళ్లి ఐడీ కార్డులు పరిశీలించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఎస్టేట్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ రైతుబజారులో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాల్స్ డ్రా తీసినప్పుడు తేడా లేకుండా చూడాలన్నారు. ప్రతి పదిరోజులకొకసారి స్టాల్స్ డ్రా తీయాలన్నారు. స్టాల్స్‌లో ఎవరైనా బినామీలుంటే సహించేది లేదన్నారు. దీనికి పూర్తిగా ఎస్టేట్ ఆఫీసర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.



సీతమ్మధార రైతుబజారులో ఆర్గానిక్ స్టాల్‌లో కందిపప్పు పరిశీలిస్తున్న యాసిన్